క్లుప్తంగా

రోజువారి నివేదిక అందించాలి

వేంసూరు: భూ భారతిలో పరిష్కరిస్తున్న భూ సమస్యలపై రోజు వారి నివేదిక ఇవ్వాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మండల రెవెన్యూ అధికారులను సూచించారు. శుక్రవారం వేంసూరు తహసీల్‌లో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ భారతి రోజు వారి నివేదిక అందించడంతో పాటు ఏఏ విభాగంలో ఎన్ని పరిష్కరించారు. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాణిక్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు దైతమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో వేంచేసి ఉన్న గట్టు దైతమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూరు, రావికంపాడు గ్రామాల ప్రజలు మొక్కులు తీర్చుకొని, అమ్మవారికి కానుకలు సమర్పించారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, తల్లి దీవెనలు గ్రామంపై ఉండాలని భక్తులు పూజలు నిర్వహించారు.

బండి పార్థసారథిరెడ్డిని కలిసిన అధ్యాపకులు


ఎంపీ బండి పార్థసారథిరెడ్డిని కలిసిన కళాశాల అధ్యాపకులు

వేంసూరు: మండలంలోని కందుకూరులోని బండి సోమకాంతమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో.. అధ్యాపకులు హెటిరో డ్రగ్స్ అధినేత, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులకు సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత సీటు, బైపీసీ చదివిన విద్యార్థులకు ఉచిత నర్సింగ్ సీటు ఇవ్వడంతో పాటుగా.. సత్తుపల్లి జూనియర్ కళాశాలలో సౌకర్యాలు కల్పనకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష


ముష్టికుంట్లలో కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న దృశ్యం

బోనకల్: కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని క్లస్టర్ ఇన్‌చార్జ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మైనారిటీ సెల్ అధ్యక్షులు షాజహాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు ముమ్మరం

- తామరచెరువు, బేతుపల్లి చెరువుల వద్ద ఘాట్ల ఏర్పాట్లు
- అందుబాటులో క్రేన్లు, గజ ఈతగాళ్లు
- నిరంతర పర్యవేక్షణలో అధికారులు


నిమజ్జన ఘాట్ మెట్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది


తామరచెరువు కట్టపై బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సత్తుపల్లిటౌన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథులను మూడవ రోజు నుంచే నిమజ్జనానికి ఉత్సవ కమిటీలు ఆసక్తి చూపిస్తుంటాయి. ఈ నేపథ్యాన నిమజ్జనానికి సంబంధించి సత్తుపల్లిలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మున్సిపల్, విద్యుత్, పోలీస్, రెవెన్యూ, సింగరేణి, పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖల ఆధ్వర్యాన నిమజ్జన ఘాట్లు వద్ద ఏర్పాట్లు చేయనున్నారు.

బేతుపల్లి, తామర చెరువుల వద్ద..

సత్తుపల్లి ప్రాంతంలోని వినాయక విగ్రహాలను ఎక్కువగా బేతుపల్లి, తామర చెరువుల్లో 5, 7, 9వ రోజుల్లో నిమజ్జనాలు చేస్తారు. మున్సిపాలిటీ పరిధిలోని చిన్న, మధ్యతరహా గణపతులను స్థానిక తామర చెరువులో నిమజ్జనం చేయనున్నారు. ఇందుకోసం తామర చెరువు కట్టరోడ్డును మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా ఆధ్వర్యాన మున్సిపల్ సిబ్బంది జంగిల్ శుభ్రం చేయడం, శానిటేషన్, బారికేడ్లు, ఫ్లెడ్‌లైట్లు ఏర్పాట్లలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమైంది. ఈ ఏడాది తామర చెరువు వద్ద క్రేన్‌ను కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయనున్నారు. బేతుపల్లి చెరువు వద్ద ఇక్కడ భారీ గణపతులను నిమజ్జనం చేయనున్నటంతో భారీ క్రేన్ సింగరేణి సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. వాహనాల రాకపోకలు సాజావుగా సాగేలా పోలీసులు జాగ్రత్తలు చేపట్టారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా..



గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తామర చెరువుతో పాటు బేతుపల్లి చెరువు వద్ద ఘాట్లను ఏర్పాటు చేశాం. క్రేన్లు, గత ఈతగాళ్లు, ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం.

– కె.నర్సింహా, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


వైరారూరల్: నీట మునిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా/వైరారూరల్: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులు అధైర్య పడకుండా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని వల్లాపురం, ముసలిముడుగు గ్రామంలో భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి వ్యవసాయ శాఖ, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టపోయిన పంటల సర్వే నిర్వహించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్నానాల లక్ష్మీపురంలో వైరా నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, దార్నా రాజశేఖర్, సూరంపల్లి రామారావు రైతులు పాల్గొన్నారు.

- ఏన్కూరు: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సందర్శించారు. పాఠశాల పరిసరాలను, వంటగదిని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, హెల్త్ క్యాంపులు పెట్టి బాలికలకు వైద్యం అందించాలని కోరారు. ప్రభుత్వ వైద్యాధికారి రాములు, ప్రత్యేకాధికారి లావణ్య పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభం


సర్వే చేస్తున్న ఏఈఓ దీపిక

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని ఏడు క్లస్టర్ల పరిధిలో ఉన్న 14వేల ఎకరాలు పంట భూములకు శుక్రవారం నుంచి డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభమైంది. సర్వే నంబర్ల ఆధారంగా చేపడుతున్న ఈ సర్వేలో ఏఈఓలకు ఒక్కో క్లస్టర్ పరిధిలో 2వేల ఎకరాల లక్ష్యాన్ని వ్యవసాయ విస్తరణాధికారులు నిర్దేశించారు. దీంతో ఏఈఓలు క్షేత్రస్థాయిలో వెళ్లి ఆయా పంటల విస్తీర్ణాన్ని నమోదు చేస్తున్నారు. సర్వేలో వరి పంటతో పాటు మిర్చి, పత్తి తదితర వాణిజ్య పంటలు కూడా నమోదు చేస్తున్నారు. డిజిటల్ సర్వేను కల్లూరు మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎం.రూప పర్యవేక్షిస్తున్నారు.

యూరియా అందించాలి


వైరా సొసైటీ సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: రైతులకు సకాలంలో యూరియా అందించాలి తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు వైరాలోని సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏఓ మయాన్ మంజుఖాన్, సొసైటీ సీఈఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావులు మాట్లాడుతూ.. వైరా రిజర్వాయర్ ఆయకట్టు కింద 18వేల ఎకరాల వరిసాగు చేస్తున్నారని ప్రస్తుతం యూరియా లేక పంటలు ఎదుగుదల లోపించి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రామారావు, సాంబశివరావు, వీరభద్రం, నరసయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రవి, రాజు, కృష్ణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థికి ఆర్థిక సాయం


రూ.20వేలు అందిస్తున్న డాక్టర్ రామాల సురేష్

సత్తుపల్లి: వేంసూరు మండలం దుద్దేపూడికి చెందిన పూరేటి వెంకటేశ్వరరావు, లక్ష్మీ దంపతుల కుమార్తె హర్షిత ట్రిపుల్‌ఐటీ సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం సత్తుపల్లిలో మాలమహానాడు ఆధ్వర్యాన రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. చదువులో ప్రతిభచూపి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యూస్టార్ పిల్లల ఆస్పత్రి వైద్యాధికారి రామాల సురేష్, లైబ్రేరియన్ మల్లికార్జున్‌రావు, మల్లికార్జున్‌రావు, సురేష్, రత్తయ్య, వెంకటేశ్వరరావు, కృష్ణ, మోహన్‌రావు, మైకిల్, అరుణ్, లక్ష్మీనారాయణ, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు..

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదిలో ప్రతిభ కనబరిచిన కె.మహిమకు పాఠశాల ఉపాధ్యాయులు సాగి సుజాత, పొట్ట రామారావులు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. వీరితో పాటు పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

మధిర: సమాజ భాగస్వామ్యంతోనే టీబీ వ్యాధిని సంపూర్ణంగా అంతం చేయొచ్చని టీబీ అలర్ట్ ఇండియా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వెంకటేష్, కోఆర్డినేటర్ గంటయ్య తెలిపారు. శుక్రవారం దెందుకూరు, మాటూరు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య సిబ్బందికి టీబీ వ్యాధిని గుర్తించేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. 14 సంవత్సరాల పిల్లల్లో టీబీ లక్షణాలు ఉంటే వారి వివరాలను ఆన్‌లైన్ చేసి టీబీ అలర్ట్ ఇండియా సంస్థకు పంపాలని తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పృథ్వీరాజ్ నాయక్, రంజిత్, సీడీపీఓ బాల త్రిపుర సుందరి దేవి తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతులను నివారించాలి

ముదిగొండ: ముదిగొండలో కుక్కలు, కోతుల బెడదను నివారించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యాన ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడుతూ.. కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు బయటకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని, బ్లీచింగ్, వీధిలైట్లు, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి సీహెచ్.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బట్టు రాజు, మంకెన దామోదర్, మందరపు వెంకయ్య, ఇరుకు నాగేశ్వరరావు, పద్మావతి, కట్టకూరి ఉపేందర్, కుంచం జాని, పుచ్చకాయల నరేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కట్లేరుకు తగ్గని వరద ఉధృతి


కట్లేరుకు కొనసాగుతున్న వరద ఉధృతి

ఎర్రుపాలెం: తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద రావడంతో కట్లేరుకు వరద ఉధృతి తగ్గడంలేదు. నిండు కుండలా కట్లేరు ప్రవహిస్తుంది. శుక్రవారం వర్షం కురియకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వరి, పత్తి తదితర పంటపొలాలు నీట మునగడంతో చేలల్లోని వరద నీటిని రైతులు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిరూరల్: మండలంలోని రామానగరంలో పారిశుద్ధ్యం పడకేసిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. శుక్రవారం గ్రామంలో ఆయన అపరిశుభ్రంగా ఉన్న రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించి మాట్లాడారు. వర్షాలతో వీధులన్నీ బురదమయంగా ఉన్నాయని, వీధిలైట్లు వెలగడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే గ్రామస్తులతో కలిసి ఆందోళనలు చేయాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత, అమల, పిల్లి జాను, సంజీవరావు, నాగమణి, రూతమ్మ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై సర్వే


నూతనకల్‌లో సర్వే చేస్తున్న నాయకులు

తల్లాడ: మండలంలోని నూతనకల్ గ్రామంలో శుక్రవారం స్థానిక సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్ మాట్లాడుతూ.. పేదల సొమ్మును పన్నులపేరుతో వసూలు చేసి.. రాయితీల పేరుతో కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ కాలనీల్లో విద్యుత్ దీపాలు వెలగటం లేదన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నరేష్, లోకేశ్వరరావు, సుందర్‌రావు, కృష్ణయ్య, రాము, రవి, గోపి పాల్గొన్నారు.

గోడ గడియారాలు పంపిణీ


గోడగడియారాలు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు గోడ గడియారాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రం ఉన్న గోడగడియారాలను గ్రామంలో 500మందికి అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, నరసింహారావు, సైదులు, వసాని వెంకన్న, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

సత్తుపల్లిరూరల్: గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామివారి ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు దళాధిపతి అంజయ్య, సహాయ దళాధిపతులు శ్రీధర్, రంగారెడ్డి, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి పీఓకు వినతి

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లకు మరమ్మతులు సక్రమంగా చేయించాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ కోరారు. శుక్రవారం సింగరేణి పీఓ ప్రహ్లాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తడికమళ్ల యోబు, పాలకుర్తి వీరయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి ప్రచారం

బోనకల్: ఈ నెల 31న ఖమ్మంలో జరిగే డీవైఎఫ్ఐ 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా ముత్తారావు శుక్రవారం మండలకేంద్రంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో చెడు అలవాట్లకు దగ్గరై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా తీర్మానాలు చేసి కార్యాచరణ రూపొందించి పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రోహిత్, నరేష్, బంక శ్రీను, అరవిందకుమార్ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ.. స్థానిక బీజేపీ నాయకులు హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును కలిసిన వినతిపత్రం అందించారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు కూర్చోడానికి బల్లలు, తాగునీరు, విద్యుత్ లైట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వంటి సౌకర్యాలను కల్పించాలని కోరాగా.. సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొండా గోపి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సాధించుకోవాలి

కారేపల్లి: మున్నూరుకాపులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని ఖమ్మం జిల్లా మున్నూరు కాపుల సంఘం మహిళా అధ్యక్షురాలు పగడాల మంజుల అన్నారు. శుక్రవారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన మున్నూరుకాపుల సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతకుముందు మున్నూరుకాపు సంఘం మండల నాయకులు వాకాటి సురేష్ మాతృమూర్తి సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పుల్లారావు, ప్రకాశ్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారావు, సురేష్, సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవం


మధిర: మర్లపాడులో పీడీ రవికుమార్‌కు సన్మానం..


కొణిజర్ల: బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు


సత్తుపల్లిరూరల్: జేవీఆర్ కళాశాలలో..

మధిర: తెలుగు భాష అమ్మలాంటిదని, అలాంటి భాషను మరకూడదని మడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సాయి కృష్ణమాచార్యులు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చందర్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష ఉపాధ్యాయిని ఎస్ శైలజ, వ్యాయామ ఉపాధ్యాయుడు మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని షైన్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా భాష గొప్పతనం, విశిష్టతపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్సార్ పాషా, లాల్ మహ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత పాల్గొన్నారు.

ముదిగొండ: మండల కేంద్రంలోని బాణాపురం జెడ్పీఉన్నత పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. పాఠశాల విద్యార్థులచే క్రీడా ప్రతిజ్ఞ చేయించి.. పూర్వ క్రీడా విద్యార్థులను సన్మానించారు. అనంతరం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల, డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ యం.నవ్య రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలికలకు వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కోఆర్డినేటర్లు ఐశ్వర్య, దీప్తి, రాజేశ్వరి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దగోపతిలో..

మండలంలోని పెద్దగోపతిలో ప్రధానోపాధ్యాయుడు కె.మార్క్, పీడీ షేక్.రంజాన్‌లు మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూల మాలలేసి నివాళులు అర్పించారు. బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ బాల భారతి విద్యాలయంలో విద్యార్థులు తమ తరగతి గదుల్లో బ్లాక్ బోర్డుపై తెలుగు అక్షరాలను తప్పులు లేకుండా లిఖించారు. తెలుగు భాషపై డిబెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్, పాఠశాల డైరెక్టర్ శ్రావణి, కేఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, తెలుగు పండితులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని తెలుగు విభాగాధిపతి డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. గెలుపొందిన విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఓ.చెన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిష్టారం హైస్కూల్‌లో

కిష్టారం హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయురాలు చిరుమామిళ్ల పద్మావతిని ఘనంగా సత్కరించారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎంలు ఏఎన్‌వి రాంబాబు, బొంతు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రియాజుద్దీన్, సమ్మద్ పాల్గొన్నారు.

వైరాలో క్రీడా పోటీలు


క్రీడా పోటీల విజేతలతో నిర్వాహకులు

వైరా: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైరా ఇండోర్ స్టేడియంలో అండర్-12, అండర్-14, అండర్-17 షటిల్ పోటీలు బాల బాలికలకు నిర్వహించారు. ఇండోర్ స్టేడియం కోచ్ యండీ ఆంజాద్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వైరాలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల బాల బాలికలలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను లయన్స్‌క్లబ్ పెద్దలు డాక్టర్ కాపా మురళీ కృష్ణ, ఐటీ ఆఫీసర్ శేషుకుమార్ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రియాంత్, సాయికృష్ణ, గోపాల్, సతీష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 మధిర ఎస్.కె. సైదులు - 90524 34278
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎస్. జయరాజు - 96528 68642